క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీ



చిన్నారులతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగు గ్రామ ఎస్టీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారా.. లేదా? అనే వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

- రాగి తీగలు చోరీ



కోవూరు: మండలంలోని లేగుంటపాడు పరిధిలో పంట పొలాల మధ్య గుర్తుతెలియని వ్యక్తులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. స్థానిక రైతులు ఎప్పటిలానే సాగు పనులు చేసేందుకు ఉదయం పంట పొలాలకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమైనట్లు గుర్తించారు. అందులోని రాగి తీగలను చోరీకి గురికావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా గస్తీని ముమ్మరం చేయాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

మనుబోలు: మండల కేంద్రంలో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. గురువారం ఎంపీడీఓ జలజాక్షి, పంచాయతీ కార్యదర్శి గరుడయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధి కుక్కల వల్ల పిల్లల్ని బయటకు పంపాలంటేనే భయంగా ఉందన్నారు. ఇప్పటికే కుక్కల దాడిలో పలువురు గాయాలపాలయ్యారని తెలిపారు.

ప్రత్యేక బస్సుల్లో పయనం



వెంకటాచలం: మెగా డీఎస్సీ – 2025లో ఎంపికైన అభ్యర్థులు మండలంలోని గొలగమూడి నుంచి బస్సుల్లో అమరావతికి గురువారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని 788 అభ్యర్థులు, వారికి తోడుగా కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి గొలగమూడికి చేరుకున్నారు. ఉదయం మొత్తం 41 బస్సుల్లో వెళ్లారని అధికారులు తెలియజేశారు.

వేరుశనగ సాగుపై సమావేశం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ముత్తుకూరు(పొదలకూరు): జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా ముత్తుకూరు మండలం నారికేళపల్లి, పంటపాళెం గ్రామాల్లో వేరుశనగ రైతులతో శాస్త్రవేత్తలు గురువారం సమావేశం నిర్వహించారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్ వేరుశనగ పంట సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. చీడపీడలను తట్టుకునే మేలైన విత్తనాలను గురించి వివరించారు. సమావేశంలో ఏఓ జ్యోత్స్న రాణి, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఈఓ దేవరాజ్, సహాయకులు కరీం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా..

- అనధికార ఆక్వాకు చెక్ పడేనా?
- మండలంలో 1,500 పైగా ఎకరాల్లో సాగు
- ప్రభుత్వాదాయానికి గండి

తోటపల్లిగూడూరు: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే రంగాల్లో ఆక్వా ఒకటి. నిత్యం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. అయితే అనుమతి లేని సాగు ద్వారా ప్రభుత్వానికి రాబడి తగ్గుతోంది. మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉన్నట్లు మత్స్యశాఖాధికారులు అంచనా. ఇందులో 4,500 ఎకరాల్లో మంచి నీటి చెరువులు, మరో 1,500 ఎకరాల్లో ఉప్పునీటి చెరువుల్లో రొయ్యల పెంపకం జరుగుతోంది. 1,200 వేల మంది రైతులు మత్స్యశాఖ అధికారుల అనుమతితో ఆక్వా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అనుకూల సీజన్ కావడంతో మరో వెయ్యి హెక్టార్లలో సాగు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

మా ఇష్టం

సాధారణంగా ఆక్వా సాగు చేపట్టాలంటే ముందుగా రైతులు సంబంధిత భూమి వరిసాగుకు పనికి రాదంటూ రెవెన్యూ అధికారుల వద్ద ధ్రువీకరణపత్రం తీసుకోవాలి. ఆపై విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. చివరిగా నిబంధనల మేరకు చలానా కట్టి మత్స్యశాఖాధికారుల అనుమతి పొందాలి. అయితే ఇదంతా సమయం, ఖర్చుతో కూడిన పని కావడంతో కొందరు వ్యక్తులు నిబంధనల్ని పట్టించుకోకుండా అనధికారికంగా సాగును ప్రారంభించేస్తున్నారు. మండలంలోని అధికారికంగా 6 వేల ఎకరాల్లో ఉండగా, అనధికారికంగా మరో 1,500 ఎకరాల్లో ఉన్నట్లు అంచనా.



కోడూరు సమీపంలో అనధికారికంగా సాగులో ఉన్న రొయ్యల చెరువు

పాపం వరి రైతులు

అనధికారికంగా చేపట్టిన ఆక్వా సాగు మూలంగా వరి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. రొయ్యల గుంతలకు అనుమతి కోసం వెళ్లినప్పుడు పక్కనున్న పంట పొలాలకు ఇబ్బంది లేదంటేనే మత్స్యశాఖాధికారులు అనుమతిస్తారు. అయితే కొందరు చేపట్టిన ఈ అనధికారిక ఆక్వా కారణంగా పక్కనున్న పంట పొలాలు బీడుగా మారుతున్నాయి. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసి తమ పంట పొలాలను రక్షించాలని వరి రైతులు అభ్యర్థిస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వరుస నష్టాలు భరించలేని రైతులు క్రాప్ హాలిడేను ప్రకటిస్తున్నారు.



రొయ్యల చెరువుల ఉప్పు నీటితో వరిగొండ ప్రాంతంలో దెబ్బతిన్న వరిపంట (ఫైల్)

పంటలు నాశనం

మాగాణిలో అనధికారికంగా సాగులో ఉన్న రొయ్యల గుంతలతో వరిపంట నాశనమవుతోంది. పొలాలు బీడుగా మారుతున్నాయి. కష్టించి పండించినా కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదు. అనధికారిక ఆక్వాకు చెక్ పెట్టాలని ఎంతో కాలంగా అధికారుకు విన్నవిస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

– మన్నెం చిరంజీవులగౌడ్, వరి రైతు, తోటపల్లిగూడూరు



చర్యలు తప్పవు

కొందరు రొయ్యల చెరువుల సాగుకు అనుమతి కోరుతూ ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. వారికి త్వరలోనే అనుమతి మంజూరు చేస్తాం. నిబంధనలు పాటించకుండా రొయ్యల చెరువులు వేసిన రైతులకు ఇది వరకే నోటీసులివ్వడం జరిగింది. స్పందించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

– పూజిత, ఎఫ్‌డీఓ, ముత్తుకూరు

ప్రమాదకరంగా వంతెన

- హెవీ లారీల రాకపోకలు
- బ్రిడ్జి బలహీనంగా ఉందని హెచ్చరిక

పొదలకూరు: బలహీనంగా ఉన్న దశాబ్దాల నాటి వంతెనపై హెవీ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఆలూర్తి చెరువుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని బలహీనంగా మారినట్టు ఆర్అండ్‌బీ అధికారులు గుర్తించారు. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగింకూడదని హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే ధాన్యం, కర్ర లారీలు దానిపై తిరుగుతూనే ఉన్నాయి. అల్లూర్తి గ్రామానికి చెందిన వాహనాలే కాక నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం వాహనాలు ఇదే మార్గం గుండా వెళుతుంటాయి. దీంతో ప్రమాదం పొంచి ఉంది. బ్రిడ్జి దెబ్బతింటే వాహన రాకపోకలు ఆగిపోయే అవకాశం ఉంది.



శిథిలావస్థలో ఉన్న వంతెన

ఆర్థిక సాయం అందజేత

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌కు సహచర కానిస్టేబుళ్లు, అధికారులు ఆర్థిక చేయూతనందించారు. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన పి.నవీన్‌కుమార్ నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈనెల 11వ తేదీన విధులకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రెండు కాళ్లు విరిగిపోయి అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్‌కు అవసరమైన నగదును అందించేందుకు 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్, సీఐలు సుబ్బారావు, అంకమరావు తదితరులు ముందుకొచ్చారు. అందరూ కలిసి రూ.1,73,600 నగదు సేకరించారు. కానిస్టేబుల్స్ జి.మస్తాన్, షేక్.గౌస్‌బాషా, జి.వేణులు గురువారం అపోలో హాస్పిటల్‌కు చేరుకుని ఆ మొత్తాన్ని నవీన్‌కుమార్ తల్లికి అందజేశారు. తామంతా ఉన్నామని సహచరునికి ధైర్యం చెప్పారు.



నవీన్‌కుమార్ తల్లికి నగదు అందజేస్తున్న కానిస్టేబుల్స్

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

కోవూరు: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కలసికట్టుగా కృషి చేయాలని పార్టీ వలంటీర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి కాటంరెడ్డి దినేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొత్తూరులో ఉన్న ఆయన నివాసంలో పార్టీ శ్రేణులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు మండలం, పడుగుపాడు పంచాయతీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన గ్రామ కమిటీ అధ్యక్షుడు రావూరు అంకయ్యను అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీకి పునాది బలంగా ఉండాలని, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు క్రమం తప్పకుండా గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. ఈ విధంగా గ్రామంలోనే కాకుండా మండల, జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ప్రజలకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి, పడుగుపాడు ఉపసర్పంచ్ అహ్మద్, గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు కవరగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు

ముత్తుకూరు(పొదలకూరు): మండల కేంద్రమైన ముత్తుకూరులో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను గురువారం నిర్వహించారు. తొలుత కార్మిక సంఘం పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుల్లయ్య, ఉపాధ్యక్షుడు రాధయ్య పాల్గొన్నారు.

⇨ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా దుంపల ఏడుకొండలు, నక్క శ్యామ్, సభ్యులుగా తొమ్మిదిని ఎంపిక చేశారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

మహిళలకు వైద్య పరీక్షలు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామం సచివాలయం – 2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విరువూరు ఆయుష్ వైద్యాధికారి వినోద్‌కుమార్, సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రోహిణి, శరణ్య, పుష్పవేణి, పద్మజ, వరలక్ష్మి, లక్ష్మీకాంతమ్మ, ఆశా వర్కర్లు వరలక్ష్మి, వాణి పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కొట్టాలు గ్రామంలో కామాక్షితాయి ఆలయ మాజీ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు దంపతులు పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తమ సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరులో జిల్లాస్థాయి షటిల్ పోటీలు

ఇందుకూరుపేట: ఏకొల్లు సుధీర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరులో ఈనెల 27, 28వ తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను జరుగుతాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా డీపీ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచే వారికి రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలను అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు నిబంధనల మేరకు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ప్రసన్న (25) నెల్లూరు జీజీహెచ్‌లో అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందింది. ఈ మేరకు పొదలకూరు పోలీసులకు సమాచారం అందడంతో తహసీల్దార్ సమక్షంలో గురువారం పోస్టుమార్టం చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం, విరువూరు, తాటిపర్తి సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పొదలకూరు డీఈఈ పీ.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కొమరికలో వైద్య శిబిరం



ఇందుకూరుపేట: కొమరిక గ్రామంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్‌రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చేవూరు వెంకట్రావు, శివప్రసాద్, మెట్టా రమేష్‌రెడ్డి, తిరుపతి, మురళి, భాస్కర్, వెంకటశేషయ్య, రామ్‌బాబు పాల్గొన్నారు.

చలపతిరావు ఎదుగుదలను ఓర్వలేకే అక్రమ అరెస్టు



మాట్లాడుతున్న నాయకులు

- కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు: జిల్లా స్థాయిలో ఎదుగుతున్న దళిత నేత చలపతిరావును చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టుకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి అధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొని మాట్లాడారు. రాజకీయ కక్షలు ఒక వైఎస్సార్‌సీపీని టార్గెట్ చేస్తూ అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు అన్నివిధాలా నష్టపోతున్నారన్నారు. దీనిని దారిమళ్లించేందుకు అక్రమ అరెస్టును తీసుకొచ్చారన్నారు. మీరు అధికారంలో ఉన్నారని అహంకారాన్ని చూపిస్తే రాబోయే రోజుల్లో రెట్టింపు చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఎప్పటికీ ఒకే ప్రభుత్వం స్థిరంగా ఉండదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా తప్పుడు కేసులు పెట్టడాన్ని పక్కనపెట్టి, కోవూరు నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లు మావులూరు శ్రీనివాసులురెడ్డి, చిమటా శేషగిరిరావు, కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. పట్టణంలో 'స్వచ్ఛోత్సవ్' కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణంపై గురువారం అవగాహన కల్పిస్తూ బస్టాండ్ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని నిత్యం శుభ్రంగా ఉంచేందుకు పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ప్రజలు సహకరించాలని కోరారు. 'జీరో వేస్ట్' పట్టణంగా బుచ్చిని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ ఇంటికో మొక్క కచ్చితంగా నాటాలన్నారు. ఇల్లు, వీధి, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛోత్సవ్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, చైర్‌పర్సన్

జయహే.. ఆనందరూపిణి

పొదలకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అమరా వెంకటకృష్ణయ్య (భగవాన్), కొమ్మూరు ప్రసాద్, రాము వ్యవహరించారు.

⇨ మండలంలోని మరుపూరు గ్రామంలో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారు దేవీ కూష్మాండగా దర్శనమిచ్చారు. అల్లూరు శ్రీనివాసులురెడ్డి దంపతులు, అల్లూరు పరంధామిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

⇨ పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని సంతానలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు.

⇨ ఇనుకుర్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు.

⇨ పట్టణంలోని శివాలయంలో కామాక్షిదేవి అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

⇨ **తోటపల్లిగూడూరు:** నరుకూరు ఇందిరాకాలనీలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

⇨ వరిగొండ దేవళాలమిట్టలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలకు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, అన్నం రామచంద్రయ్య కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దేవీ నవరాత్రుల సందర్భంగా మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో నాలుగో రోజు గురువారం అమ్మవారు మధుకైటభ వధ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశపూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మహా నవావరణ పూజ నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

⇨ **మనుబోలు:** మండలంలోని మనుబోలు కోదండరామపురంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు గురువారం కాత్యాయని అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా వావిలేటి మనోజ్‌కుమార్, సుమాంజలి దంపతులు వ్యవహరించారు.

⇨ **ఇందుకూరుపేట:** దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారు నాలుగో రోజు గురువారం ధనలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింగి. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు స్థానికులు కర్పూరం హైమావతమ్మ, కుమారుడు శివకుమార్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.



పొదలకూరు: బాలాత్రిపుర సుందరి అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి



ఇందుకూరుపేట: పల్లకిసేవలో అమ్మవారు



మనుబోలు: కాత్యాయని అలంకరణలో..



పొదలకూరు: మరుపూరులో..



టీపీగూడూరు : అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు